క్లుప్తంగా

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ

నిడదవోలు: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ ఆథారిటీ (రుడా)పరిధిలో యూఏ లీబీ, జీఐఎస్ మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు నిడదవోలు పురపాలక సంఘం ప్రతిపాదిత ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించునట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రణాళికపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ, పురపాలక, పట్టణ ప్రణాళిక, రవాణా, సీడబ్ల్యూడీ, పర్యావరణ శాఖలతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలను 30 రోజుల్లో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆమే కోరారు. ప్రజల సౌకర్యార్థం మాస్టర్ ప్లాన్ ముసాయిదాను కలెక్టరేట్‌లో రుడా కార్యాలయం, నిడదవోలు మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

ఉండ్రాజవరం: కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకమైన సమయం, అంతరం ఉండాలన్నారు. తల్లి కావడానికి సరైన వయస్సు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడు మాత్రమే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. ప్రస్తుతం వివాహ వయస్సు పురుషులకు 25, స్త్రీలకు 21వ సంవత్సరాలు నిండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రమణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు అనుపోజు శ్రీరామమూర్తి, సీ.రత్నకుమారి, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య పట్టణంగా తీర్చుదిద్దుతాం

నిడదవోలు: ఆరోగ్య పట్టణంగా నిడదవోలును తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని చర్చిపేటలో ఈస్టర్న్ చర్చ్, హోప్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఈసీజీ పరీక్షలు, రక్త, మూత్ర, షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు, డెంటల్, ఆప్తమాలజీ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పట్టన అధ్యక్షుడు రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకు సాగునీరు విడుదల



నిడదవోలులో నిండుగా ప్రవహిస్తున్న పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: ఖరీఫ్ వ్యవసాయ పనుల అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి శుక్రవారం పశ్చిమడెల్టా ప్రధాన కాలువలకు 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,450 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.64 మీటర్లుగా నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలకు కూడా నీటి విడుదల పెంచారు. నరసాపురం కాలువకు 2,130 క్యూసెక్కులు, తణుకు కాలువకు 735 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,195 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 519 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

స్మార్ట్ ఫోన్ వాడకంతో అనేక సమస్యలు

సీటీఆర్ఐ: స్మార్ట్ ఫోన్ ఎక్కువ సేపు చూడడం వల్ల కళ్లు పొడిబారడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలు తలెత్తుతాయని మ్యాక్సి విజన్ ఐ హాస్పిటల్ హెడ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ప్రియంవద అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంటి సమస్యలను అధిగమించడానికి ప్రతి 20 నిమిషాలకు ఓసారి విరామం తీసుకోవాలన్నారు. డిజిటల్ స్క్రీన్‌కు కొంచెం దూరంగా ఉండడానికి ప్రయత్నించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డాక్టర్ సలహాలు పాటిస్తూ, కంటి విషయంలో జాగ్రత్త వహించాలని కోరారు.

నీడ కోసం అగచాట్లు

- సైకిల్ షెడ్లులేక విద్యార్థుల అవస్థలు
- ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాట్లు
- నియోజకవర్గంలో 28 ఉన్నత పాఠశాలల దుస్థితి ఇదీ

పెరవలి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైకిల్ షెడ్డులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆరుబయటే సైకిళ్లు పెట్టుకోవాల్సి రావడంతో అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తు ఖరీదైన సైకిళ్లు తుప్పు పట్టి మరమ్మతులకు గురౌతున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయిలు వెచ్చిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు, నిడదవోలు నియోజకవర్గంలోని 28 ఉన్నత పాఠశాలల్లో ఏ పాఠశాల పరిధిలో సైకిళ్లు పార్కింగ్‌కు షెడ్డు లేకపోవటంతో విద్యార్థులు నీడ కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యార్థులు సైకిళ్లు నిలుపుదల కోసం స్థలం లేక వర్షం వచ్చినప్పుడు నానా అగచాట్లు పడుతున్నారు.

నివేదికలు పంపించాం.



ప్రతీ పాఠశాలలో పార్కింగ్ సమస్య నెలకొంది. సమస్య పరిష్కారానికై షెడ్డుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి అంచానాలతో నివేదికలు పంపించాం. నిధులు మంజూరైతే త్వరలో పనులు ప్రారంభిస్తాం.

బి.స్వరూప్,
మండల విద్యాశాఖాదికారి పెరవలి

ఎన్ని పాఠశాలలు ఉన్నాయంటే..

నిడదవోలు నియోజకవర్గంలో 28 ఉన్నత పాఠశాలలు, 156 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులు సుమారు నలభై వేల మంది ఉండగా వీరిలో ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు 15,500 మంది వరకు ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి సైకిళ్లపై వచ్చేవారు సుమారు 6,500 మంది ఉన్నారు. ఒక్క పెరవలి మండలంలో 2,223 మంది ఉండగా వీరిలో సైకిళ్లపై వచ్చేవారు 1,050 మంది వరకు ఉన్నారు.

ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తున్నా, విద్యార్థుల అవసరానికి ఉపయోగపడక పోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయుల వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ పాఠశాలకు షెడ్డుల నిర్మాణానికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మల్లేశ్వరం ఉన్నత పాఠశాలలో సైకిళ్లు



కాకరపర్రు ఉన్నత పాఠశాలలో చెట్ల కింద నిలిపిన సైకిళ్లు



ఖండవల్లి ఉన్నత పాఠశాలలో ఎండలో ఎండుతు..

శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మవారు



కె.సావరంలో కూరగాయాలతో అలకరించిన శ్రీ దుర్గా అమ్మవారు

ఉండ్రాజవరం: ఆషాఢం మాసం పాడ్యమి శుక్రవారం సందర్భంగా కె.సావరం గ్రామంలో శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి ఆలయంలో శ్రీదుర్గా అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు అమ్మ వారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా దేవిగా అలంకరించారు. అనంతరం అర్చకులు హరిశంకర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుటుంబ సంక్షేమమే సమాజ ప్రగతి



గౌరీపట్నంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

దేవరపల్లి: కుటుంబం సంక్షేమంగా ఉంటేనే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వై.మౌనిక అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రణళికా బద్ధమైన మాతృత్వం కోసం గర్భదారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం ఉండాలన్నారు. తల్లి కావడానికి సరియైన వయస్సు శారీరకంగా, ఆరోగ్యకరంగా ఉన్నప్పుడు మాత్రమే బిడ్డ ఆరోగ్యకంగా జన్మిస్తుందని ఆమె తెలిపారు. బిడ్డకు, బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాలు వ్యత్యాసం ఉండాలన్నారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. కొత్తగా వివాహం చేసుకునే స్త్రీలకు 21 సంవత్సరాలు, పురుషులకు 25 సంవత్సరాలు ఉండాలని, బాల్య వివాహాలు నివారించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎ. శ్రీకృష్ణుడు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. రమణ, హెల్త్ సూపర్‌వైజర్ వి.అశోక్ వర్ధన్, కె.జె.ఎం జెస్సీ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ వరినాట్లు



చిలకపాడులో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

ఉండ్రాజవరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి కాలువలకు సాగునీరు అందడంతో మండలంలో సార్వా సాగు పనుల్లో రైతాంగం నిమగ్నమైనారు. బోర్లు, నీటివసతి ఉన్నా ప్రాంతాలల్లో ముందుగానే రైతులు నారుమళ్లు పోశారు. జూన్, జూలై నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నాట్లుకు కొంత వరుకు ఆటంకంగా మారింది. ప్రస్తుతం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు చవిచూశారు. ఉండ్రాజవరం మండలంలో మొత్తం 12,300 ఎకరాలు వరిసాగు చేస్తుండగా ఇప్పటివరకు 50 శాతం నాట్లు పూర్తయినట్లు ఏవో బి.రాజారావు తెలిపారు. పంట దమ్ము పనులు చేస్తుండగా, మరోవైపు వరినాట్లు వేస్తు సాగు పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి వలస కూలీలు రావడంతో వ్యవసాయ పనులు మరింత ఊపందుకున్నాయి. ముఖ్యంగా మండలంలో చాలా గ్రామాలల్లో బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నారు. చిలకపాడు గ్రామంలో బెంగాలీ కూలీలు యూనిఫాం ధరించి వరిచేల్లో నాట్లు వేస్తున్న దృశ్యం పలువురిని ఆకట్టుకుంది. కూలీ ఖర్చులు తక్కువుగా ఉండటంతో అధిక శాతం మంది వీరితోనే నాట్లు వేయిస్తున్నారు. మండల వ్యవసాయధికారి బి.రాజారావు మాట్లాడుతూ మరో వారం రోజుల్లో 100 శాతం నాట్లు వేయడం పూర్తవుతుందన్నారు. మండలంలో రైతులు భూసార ఫలితాలను బట్టి ఎరువులు వాడాలన్నారు. రైతులు త్వరగా వరినాట్లు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ అధికార్ల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

గోపాలపురం: మండలంలోని మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్సై పి.మనోహర్ కొనియాడారు. ఈ నెల 28వ తేదీన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి సంబంధించి కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రక్తదానం, సమాజంలో నిరుపేదలను గుర్తించి వారిని చదివించడం వంటి పలు సేవా కార్యక్రమాలను సంస్థ చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండల మానవత అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, నెల్లి చంద్రశేఖర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో రక్తదాన శిబిరం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై మనోహర్

సామాజిక అంశాలపై వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కమలకుమారి

నల్లజర్ల: అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా జనాభా పెరుగుదలతో కలిగే అనర్థాలపై లింగ సమానత్వం, పరస్పర గౌరవం పలు సామాజిక అంశాలపై దూబచర్ల డైట్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖనం, పోటీలు నిర్వహించారు. ఆరు పాఠశాలల నుంచి 21 మంది విద్యార్థులు హాజరవ్వగా పోటీల్లో ప్రథమ స్థానం కె.సాయి సుస్మిత (నల్లజర్ల.జడ్పీ హైస్కూలు) కె.నాగపావనీ (నారాయణపురం.జడ్పీహైస్కూలు) కె.రిషిత (చిన నింద్రకొలను) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ కమలకుమారి వెల్లడించారు. విజేతలకు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు గోవిందరాజులు, ప్రసన్నకుమారి, సీనియర్ లెక్చరర్ ఆర్.సుబ్రమణ్యం, సి.హెచ్. లక్ష్మీనారాయణ, సరోజని, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు చుక్కలు చూపిస్తున్నారు

- సుపరిపాలన–తొలి అడుగులో ఎమ్మెల్యేలకు చుక్కెదురు
- ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే తలారీ



చాగల్లు: రాష్ట్రంలో సుపరిపాలన–తొలి అడుగు అంటూ ప్రజల్లోకి వెళ్తున్న కూటమి ఎమ్మెల్యేలకు ప్రజలు చుక్కలు చూపిస్తున్నారని, హామీల అమలుపై ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సన్నాయి నొక్కులు నొక్కుతూ కార్యక్రమాన్ని ఏదో విధంగా పూర్తి చేసి సీఎం దృష్టిలో పడటం కోసం పడరాని పాట్లు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు విమర్శించారు. శుక్రవారం చాగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత గ్యాస్ ఇస్తానన్న మూడు బండలు ఇవ్వలేదు, ఇచ్చిన ఒక బండకు డబ్బులు పడలేదని ఎమ్మెల్యేలను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఏడాది తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకంలో చాలామంది పిల్లలకు రూ.8,500, రూ.9,000, రూ.10,000, రూ.11,500 ఈ విధంగా రకరకాలుగా డబ్బులు జమ అవ్వడంతో, ఆంక్షలు లేకుండా రూ. 15 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని నిలదీస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు వేస్తామని చెప్పి, రెండు నెలలైనా జమకాలేదన్నారు. తొలి అడుగు కార్యక్రమానికి వెళ్లిన ఎమ్మెల్యేలను రైతులు అడుగుతుంటే మీదేదో టెక్నికల్ ప్రాబ్లం ఉంది అందుకే వచ్చి ఉండదని సమాధానం చెప్పి తప్పుకుంటున్న పరిస్థితులు నేడు దర్శనమిస్తున్నాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ.20వేలు ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో అడుగుతున్నారన్నారు. తొలి అడుగు కార్యక్రమానికి వెళుతున్న ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక పబ్లిక్‌లో నీళ్లు నములుతున్న పరిస్థితులు నేడు ఎమ్మెల్యేలదన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన పథకాలు అమలు చేసిన తర్వాత, ఈ కార్యక్రమాన్ని పెట్టవలసింద, ఇప్పుడు పెట్టి మమ్మల్ని అందరినీ ఇబ్బంది పెడుతున్నారని వారి అంతర్గత సంభాషణలలో ఎమ్మెల్యేలు మాట్లాడుకుంటున్న పరిస్థితులు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయని తలారి వెంకట్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ జనసేనలో అయోమయం

తాళ్లపూడి: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావును పార్టీ అధిష్టానం ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించడంపై తీవ్రచర్చకు దారితీసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. నియోజకవర్గంలో జనసేన ఇప్పటికే పలు గ్రూపులుగా ఉన్న సమయంలో ఈ నిర్ణయంతో ఆయన వ్యతిరేకవర్గం పైచేయి సాధించినట్టు విశ్లేషకులు అంటున్నారు. టీవీ రామారావుకు ఆయన సామాజిక వర్గంలో పాటు, ప్రాధాన సామాజిక వర్గంగా ఉన్న నాయకులు సైతం సోషల్ మీడియా వేదికగా ఆయనకు మద్దతూ ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయంతో క్యాడర్ అయోమయంలో పడింది. ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో జనసేనను లేకుండా చేయాలనే భాగంగానే ఈ కుట్రకు తెరతీసారని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సీఎం పర్యటన సమయంలో తనకు అవమానం జరిగిందని పెద్దేవం ఎంపీటీసీ హరిబాబు ఆరోపించారు. జనసేన టీడీపీకి తోక పార్టీలా మారింది అనడానికి ఈ చర్యలే నిదర్శనంలా ఉందని ఇతర పార్టీ నాయకులు ఎద్దేవ చేస్తున్నారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



రామారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి యాళ్ల రామారావు ఇటీవల అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులతో పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, ఉప సర్పంచ్ కీర్తి శ్రీనివాస్, నాయకులు పడాల శ్రీను, అయినీడి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మధ్యవర్తిత్వానికి ప్రాముఖ్యం



కొవ్వూరులోని అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జడ్జీలు, న్యాయవాదులు

తాళ్లపూడి(కొవ్వూరు): రాష్ట్ర న్యాయధికార సంస్థ ఆదేశాల మేరకు 10వ తేది గురువారం నుంచి 16 వరుకు మధ్య వర్తిత్వంపై అవగాహనా కల్పిస్తున్నట్లు చైర్మన్ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. ఆమె అధ్యక్షతన శుక్రవారం కొవ్వూరు కోర్ట్ ప్రాంగణం నుంచి విజయ విహార్ సెంటర్ వరుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు, కక్షిదారులు అవగాహన పెంచుకోవాలని, రాబోయే రోజుల్లో కోర్టులో మధ్య వర్తిత్వంపై ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవి.ఎల్ రస్వతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయి కృష్ణ, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్, న్యాయవాదులు, మీడియేటర్స్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్, మెకానికల్ అండ్ ఆటో ఇంజినీరింగ్ సబ్జెక్టులలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఎకనామిక్స్‌లో అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉండాలన్నారు. మెకానికల్ అండ్ ఆటో ఇంజినీరింగ్ పోస్టుకు బీటెక్, బీఈ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. కళాశాలలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు సంబంధిత ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలో చాలాచోట్ల నివాసాల మధ్యలో ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో తీవ్ర అసౌకర్యంగా ఉన్నాయన్నారు. ఫలితంగా దోమలు, క్రిమి కీటకాలు, పాములు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై ఇప్పటికే పలు ఫిర్యాదులు కూడా అందాయన్నారు. దీంతో నగరంలో స్వచ్ఛతను కాపాడేందుకు వార్డు సచివాలయాల వారీగా స్థల యజమానులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో కంపచెట్లు మొలిచి అపరిశుభ్రంగా ఉంటే నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. స్పందించని యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

కంటి విషయంలో అలక్ష్యం వద్దు

సీటీఆర్ఐ: కంటి విషయలో అలక్ష్యం వద్దని రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ కొయ్యాన కుమారి అన్నారు. ఆమెన్ ట్రస్ట్ దేవరపల్లి సౌజన్యంతో హరిత దళం స్వచ్ఛంద సంస్థ శుక్రవారం స్థానిక సుబ్బారావు నగర్‌లో కంటి వైద్యశిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా వీధుల్లో చెత్తఏరుకునే సుమారు 30 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందించారు. కుమారి మాట్లాడుతూ చూపు విషయంలో శ్రద్ధ తీసుకుని నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు అందజేస్తున్న హరిత దళం సేవలు అభినందనీయమన్నారు. ఆమెన్ ట్రస్టు డైరెక్టర్ పి.ఎవాంజలిన్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పేదవారికి శిబిరాలు నిర్వహిస్తూ అనేకమందికి వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. మరో స్వచ్ఛంద సంస్థ గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రోగులకు దుప్పట్లు చీరలు పంపిణీ చేశారు. ఆ ట్రస్టు డైరెక్టర్ రోషన్ వర్గీల్ వాసా మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 50 మంది కమ్యూనిటీ సభ్యులు, హరిత దళం మేనేజర్ వై.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన కర్నాటక మంత్రి

కడియం: బుర్రిలంకలోని ఏకేఎస్‌వీ నర్సరీని కర్నాటక మైనింగ్, జియాలజీ, హార్టీకల్చర్ శాఖల మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ శుక్రవారం సందర్శించారు. నర్సరీ అధినేత, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప ఆయనకు ఘనంగా స్వాగతం పలికి వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. అరుదైన ఆయుర్వేద, పండ్ల సంబంధిత మొక్కల గురించి మంత్రి వివరాలు అడిగారు. అనంతరం గౌతమి, కోదండరామ, సత్యనారాయణ, శివాంజనేయ నర్సరీలను మంత్రి మల్లికార్జున్ సందర్శించారు.